క్లుప్తంగా

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామికి ప్రత్యేక అభిషేకం , 11 గంటలకు సుదర్శన హోమం, రాత్రి 8 గంటలకు ప్రాకారోత్సవం ఉంటుందని చెప్పారు.

నేత్రపర్వంగా గరుడ సేవ



చిత్తూరు రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో శనివారం రాత్రి గరుడసేవను నేత్ర పర్వంగా నిర్వహించారు. తొలుత మూలస్థానంలోని స్వామి వారికి పౌర్ణమి పూజలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి గరుడసేవలో ఊరేగించారు. ఊరేగింపుగా వస్తున్న స్వామికి భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కు చెల్లించుకున్నారు.

వేడుకగా గిరిప్రదక్షిణ

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో శనివారం వేడుకగా గిరిప్రదక్షిణ నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం పుర వీధుల్లో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తూ గిరిప్రదక్షిణ నిర్వహించారు.

నేడు సత్యనారాయణ వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని వరదరాజుల స్వామి ఆలయంలో ఆదివారం సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి తెలిపారు. పౌర్ణమి సందర్భంగా వదరాజుల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతం, రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు పర్యావరణ ర్యాలీ

చిత్తూరు కార్పొరేషన్: పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీ, కాలుష్య నివారణశాఖల ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు గాంధీ విగ్రహం వద్ద నుంచి నగరవనం వరకు పాదయాత్ర, సైకిల్ ర్యాలీ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు 7013646443, 7337030956 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ర్యాలీలో పాల్గొనే వారికి టీషర్ట్, బ్యాగ్, క్యాప్ ఇవ్వనున్నట్లు వివరించారు.

ప్రమాద బాధితులపై ఆరా

చిత్తూరు కార్పొరేషన్: ఒడిశా రైల్వే ప్రమాద ఘటనలో ఎవరైనా నగరవాసులు ఉన్నారా అని చిత్తూరు రైల్వేస్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఒకటో పట్టణ సీఐ భాస్కర్ విచారణ చేపట్టారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో ఒడిశా రైలు స్టాపింగ్ లేదని, చిత్తూరు నుంచి ఎవరూ వెళ్లలేదని ఆన్‌డ్యూటీ స్టేషన్ మాస్టర్ పూర్ణిమ తెలిపారు.

పేద విద్యార్థులకు వరం ప్రభుత్వ బడి




పెరుమాళ్లపల్లెలో పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: పేద విద్యార్థులకు ప్రభుత్వ బడులు వరమని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీఆర్‌సీ ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని పెరుమాళ్లపల్లె, గడ్డంవారిపల్లె గ్రామాల్లో శనివారం ఆయన, ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ వెళ్ళి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పలు విభాగాలకు కరెంటు కష్టాలు ఎదురయ్యాయి. అయితే విద్యుత్ సరఫరాలోని లోపాలు సరిదిద్దేందుకు రెండు రోజులుగా ఆస్పత్రి అధికారులు చర్యలు చేపట్టారు. కరెంటు తీగలపై వాలిన చెట్టు కొమ్మలను కత్తిరించే పనిలో పడ్డారు. తీగలను సరిచేస్తున్నారు. ఈ కారణంగా శుక్ర, శనివారాల్లో కరెంటు కోతలు న్నాయని అధికారులు చెబుతున్నారు.

చిత్తూరులో యువకుడి ఆత్మహత్య



కిరణ్ కుమార్(ఫైల్)

చిత్తూరు అర్బన్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం వెలుగు చూసింది. సీఐ భాస్కర్ కథనం మేరకు నగరంలోని భరత్ నగర్‌కు చెందిన కిరణ్ కుమార్ (40) హోంగార్డుగా పనిచేసేవాడు. అయితే గతంలో జరిగిన నకిలీ హోంగార్డుల నియామకంలో కిరణ్ సైతం తన ఉద్యోగాన్ని పోగొట్టుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇతను ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యాను పైకప్పుకు లుంగీ తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారమందుకున్న పోలీసులు శనివారం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాడు వ్యవసాయం దండగ అంటూ చంద్రబాబు ప్రభుత్వం రైతులను పక్కన పెట్టేసింది. ఎరువులు కావాలన్నా, విత్తనాలు కావాలన్నా ఎక్కడో మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి పరుగులు తీయాలి. గంటల తరబడి క్యూలో నిల్చుకునే వాళ్లు. నిల్చుకునే ఓపిక లేకపోతే చెప్పులు అయినా క్యూలో ఉంచేవాళ్లు. ఇక ఎరువులైతే బంగారమే. ఎరువుల కోసం వెళ్లి ఎన్నోసార్లు తొక్కిసలాటలో నలిగిపోయి, పోలీసులతో లాఠీ దెబ్బలు తిని నానా కష్టాలు పడేవాళ్లు. దీంతో రైతులందరూ వ్యవసాయం వదిలేసి కూలీలుగా మారిపోయారు.

2017లో యాదమరి మండలం కాశిరాల ఉన్నత పాఠశాలలో విత్తనాల కోసం బారులు తీరిన రైతులు(ఫైల్)



మూడు రోజుల క్రితం వరదరాజులపల్లి ఆర్‌బీకేలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)



నేడు వ్యవసాయం పండగ అంటూ జగనన్న ప్రభుత్వం రైతులను రాజుగా చేస్తోంది. ఎరువులైనా, విత్తనాలైనా, వారి ముంగిట్లోకే అందిస్తోంది. అందుకోసం రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసింది. అధికారులను నియమించింది. ముందుగా నమోదు చేసుకునే విధానం ప్రవేశపెట్టింది. మండల కేంద్రానికి వెళ్లకుండా, గంటల తరబడి క్యూలో నిలబడే అవసరం లేకుండా అన్నింటినీ క్రమపద్ధతిలో పంపిణీ చేస్తోంది. సబ్సిడీపై ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో గతంలో కూలీలుగా మారిన రైతులందరూ నూతనోత్సాహంతో పొలం బాట పడుతున్నారు.

నాడు దండగ - నేడు పండగ

- వ్యవ'సాయానికి' జగనన్న భరోసా
- రైతుల ముంగిట్లో ఎరువులు, విత్తనాలు, పనిముట్లు
- సాగుకు అన్ని రకాల సేవలందించే రైతు భరోసా కేంద్రాలు
- యాదమరి మండల రైతులకు ప్రభుత్వం వెచ్చించిన మొత్తం రూ.21కోట్లు

యాదమరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని రైతులను రాజులను చేసేందుకు సంకల్పించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో సాగుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించారు.

పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలంలో 26 పంచాయతీలు, 198 గ్రామాలు ఉన్నాయి. మొత్తం రైతులు 10,287 మంది ఉన్నారు. సాగుభూమి 7,169 హెక్టార్లలో ఉండగా వరి, చెరుకు, రాగి, వేరుశెనగ పంటలు పండిస్తున్నారు. వీరందరి కోసం మండల పరిధిలో 19 రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి రైతు భరోసా కేంద్రంలో సచివాలయ సిబ్బంది, రైతు మిత్రలతో కలిపి ముగ్గురు ఉద్యోగులను నియమించింది. ఈ కేంద్రంలో విత్తనాలు, ఎరువులు, యంత్రాలు అందుబాటులో ఉంచింది. భూసార పరీక్షలు నిర్వహించి ఎలాంటి ఎరువులు వాడాలి, ఎలాంటి పంటలు వేయాలని సలహాలు సూచనలను రైతులకు తెలియజేస్తున్నారు.

-యాదమరి మండలంలో 19 రైతు భరోసా కేంద్రాల్లో గత నాలుగేళ్లుగా 1196 మంది రైతులకు 21 టన్నుల ఎరువులను అందించారు. సబ్సిడీ కింద 17 మంది రైతులకు రోటావేటర్‌లు, మడకలు, ట్రాక్టర్ బ్లేడ్‌లు, చెఫ్ కటర్‌లు అందించారు. 6,897 మంది రైతులకు పంటలకు బీమా చేయగా రూ.2.01కోట్లు నష్టపరిహారం అందించారు. మండలంలో 313 మంది రైతులకు రూ.14.13లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ అందించారు. వేరుశెనగ విత్తనాలు 9,331 మంది రైతులకు గాను 3337.5క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు అందించారు.



మొత్తంగా యాదమరి మండలంలో అన్ని పథకాల కింద రైతుల కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.21 కోట్లు వెచ్చించినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నారు.

తమిళనాడుకు వెళ్లేవాళ్లం



గతంలో పంటలకు అవసరమైన ఎరువుల కోసం పక్కనే ఉన్న తమిళనాడుకు వెళ్లేవాళ్లం. అక్కడ అధిక ధరలకు కొనుక్కోవాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం రైతు భరోసా కేంద్రానికి వెళితే చాలు. సకాలంలో సబ్సిడీ కింద ఎరువులు అందిస్తున్నారు. వలంటీర్లను అడిగిన వారు వెంటనే సమాచారం ఇస్తున్నారు. దీంతో సులభంగా ఎరువులు తెచ్చుకొని పంటలకు వేస్తున్నాం.

– వెంకటేశ్వర్ రెడ్డి, రైతు, దాసరాపల్లె

అప్పట్లో వేకువ జామున వెళ్లాను



గతంలో సబ్సిడీ వేరుశెనగ విత్తనాలు కావాలంటే మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి వేకువజామున వచ్చి క్యూలో నిల్చునే వాళ్లం. తీరా తీసుకునే సమయంలో కావాల్సినవి ఇచ్చేవారు కాదు. ప్రస్తుతం అలాంటి సమస్యల్లేవు. గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారులు విత్తనాలు ఇస్తున్నారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తీసుకుంటున్నాం.

– గుణసుందర్ రెడ్డి, రైతు, మిట్టిండ్లు

ఖాతాలోకే పరిహారం



గతంలో పంట నష్టపరిహారం కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వాళ్లు చెబితేనే అధికారులు ఆమోదించే పరిస్థితి ఉండేది. ఇప్పుడు పంటలు వేసిన వెంటనే ఉచితంగా బీమా చేస్తున్నారు. నష్టం వాటిల్లినట్లు అధికారులకు సమాచారం ఇస్తే వారు నమోదు చేస్తున్నారు. పరిహారం ఖాతాలో జమ అయిపోతోంది.

– మాణిక్యం, రైతు, రాచూరు

భూసార పరీక్షలతో మంచి దిగుబడులు



సీజనల్‌కు తగ్గట్టు వ్యవసాయశాఖ అధికారులు భూసార పరీక్షలు చేసి మా పొలాల్లో ఎలాంటి పంటలు పండించాలో సూచనలు ఇస్తున్నారు. వాటికి ఎలాంటి ఎరువులు అవసరమో వాటిని సూచిస్తున్నారు. వారి సూచనల ప్రకారం పంటలు సాగు చేసి, ఎరువులు వేస్తుండడంతో నష్టం లేకుండా పంట చేతికొస్తోంది.

– దయానంద రెడ్డి, రైతు, ముద్దురామాపురం

వరసిద్ధుని దర్శనానికి 5 గంటలు



ఆలయం వెలుపల వరకు బారులు తీరిన భక్తులు



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ది వినాయక స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. దీంతో స్వామిని దర్శించుకోవాలంటే సుమారు 5 గంటల సమయం పడుతోంది. శనివారం ఉదయం నుంచి భక్తుల తాకిడి మొదలవడంతో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని స్వామివారి దర్శనం కల్పించారు.

వినాయకుని సేవలో గుంటూరు కలెక్టర్

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ లక్ష్మీగణపతి హోమంలో పాల్గొని పూజలు చేశారు. ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, తహసీల్దార్ సుశీల పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళంను తిరుపతిలోని రామచంద్రాపురానికి చెందిన పవన్‌కళ్యాణ్ ఆలయ అధికారులకు అందించారు. మధ్యాహ్నం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అధికారులకు విరాళం అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



పాలేరు జగనన్న కాలనీలో పనులను పరిశీలిస్తున్న పీడీ పద్మనాభం

బంగారుపాళెం: గృహ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని హౌసింగ్ పీడీ పద్మనాభం తెలిపారు. మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో శనివారం సాయంత్రం గృహనిర్మాణ పనులను అధికారులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, నిర్దేశించిన సమయానికి గృహనిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశించారు. మండలంలో 3,284 గృహాలను మంజూరైతే, ఇప్పటి వరకు 1500 గృహాలు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని ఏఈ గుణశేఖర్‌రెడ్డి పీడీకి వివరించారు. ఈ కార్యక్రమంలో సైట్ ఇంజినీరు మమత, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఫీడర్ల ఏర్పాటుకు సర్వే



ఉద్యోగులతో ప్రమాణం చేయించిన ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయ సర్వీసులకు సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేకంగా ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేయడానికి సర్వే చేయనున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి తెలిపారు. శనివారం రూరల్ ఈఈ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆర్‌డీఎస్ఎస్ (రీవెంపుడ్ డ్రిస్టిబ్యూషన్ సెక్టార్ స్కీం)లో భాగంగా సర్వే చేయనున్నట్లు వివరించారు. వ్యవసాయానికి ప్రత్యేకంగా ఫీడర్‌ను ఏర్పాటు చేసి వాటి నుంచి విద్యుత్ సరఫరా ఇస్తామన్నారు. ఇందుకోసం ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో ఎన్ని కిలోమీటర్లు వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి అనే అంశాలను పరిశీలించి నమోదు చేయాలన్నారు. తదుపరి వీటికోసం ప్రత్యేకంగా లైన్‌లాగి సరఫరా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పర్యావరణానికి హాని చేయవద్దు

పర్యావరణానికి హాని చేయవద్దని ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి తెలిపారు. రూరల్ ఈఈ కార్యాలయంలో పర్యావరణాన్ని రక్షించడానికి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) కార్యక్రమం నిర్వహించి, అధికారులతో ఉద్యోగులతో ప్రమాణం చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రకృతితో సమకాలికమైన హాని కలిగించని జీవనశైలిని ఆచరించాలని సూచించారు. స్వల్ప దూరాలకు సైకిల్‌వాడటం, ట్రెడ్‌మిల్‌కు బదులు జాగింగ్ చేయడం వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. మొక్కలను పెంచడానికి కృషి చేయాలని ఉద్యోగులతో ప్రమాణం చేయించారు.

వలంటీర్లకు సన్మానం



వలంటీర్లకు వందనం కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు

పూతలపట్టు: మండలంలోని వావిల్‌తోట పంచాయతీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లకు శనివారం ఎంపీడీఓ గౌరి సన్మానించారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా 23 మంది వలంటీర్లు సేవామిత్ర అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ స్థానిక సమస్యలను పరిష్కరించడంలో వలంటీర్లు ముందుండాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అమలులో కీలక పాత్ర పోషించేది వలంటీర్లనని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మురళీకృష్ణ, సర్పంచ్ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: యాదమరి మండలం 184 గొల్లపల్లి గ్రామంలో శనివారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. జయరామ మందడి అనే వ్యక్తి వద్ద 25 మద్యం ప్యాకెట్లు సీజ్ చేశారు. ఆయన్ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు మోహన్ బాబు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి



మృతి చెందిన రఘు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక పాంచాలిపురానికి చెందిన రఘు(47) చిత్తూరు రైల్వేస్టేషన్‌లో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం మేరకు, రఘు గతంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. శుక్రవారం రాత్రి రైల్వేస్టేషన్‌లో పడుకొని ఉండటం గుర్తించి ఇంటికి వెళ్లాలని కానిస్టేబుళ్లు చెప్పారు. అయితే రాత్రంతా ఆయన అక్కడే పడుకోగా శనివారం ఉదయం చూస్తే మరణించినట్లు గుర్తించారు. మృతుని కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారని వివరించారు.

భూమిని ఆక్రమించుకుని దాడి చేశారు

చిత్తూరు రూరల్: తమ భూమిని ఆక్రమించుకోవడంతోపాటు మామిడి తోటలోని కాయలను కోసి తరలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అడ్డగించిన తన భర్తపై దాడి చేశారని యాదమరి మండలం తాళ్లమడుగుకు చెందిన గౌతమి ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాళ్లమడుగుకు సమీపంలోని కేజీబీ కాలనీలో తమకు పూర్వీకుల నుంచి లభించిన రెండు ఎకరాల మామిడి తోటను అదే గ్రామానికి చెందిన కటారి గిరీష్, జయ లక్ష్మమ్మ, చంద్రమ్మ ఆక్రమించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం భూమి ఆక్రమణను అడ్డుకున్న తన భర్త హైకోర్టు లాయర్ దామోదర్‌ను తీవ్రంగా కొట్టడంతోపాటు తమ కారు అద్దాలను పగలగొట్టి తమపై దౌర్జన్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రాణహాని ఉందని, పోలీసు రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

పెనుమూరులో..

తరతరాల భూమి ఆక్రమించుకున్నారని పెనుమూరు మండలం మనియానం గుడిపల్లికి చెందిన హర్షవర్ధన్‌నాయుడు తెలిపాడు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడాడు. ఆక్రమణదారులు భూమిని ఆక్రమించుకోవడంతోపాటు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్

చిత్తూరు అర్బన్: పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కమిషనర్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ హామీ ఇచ్చారు. చిత్తూరు నగరంలోని పార్కులో శనివారం పారిశుధ్య కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు అవసరమైన పనిముట్లు అందించేలా చూస్తామన్నారు. సమావేశంలో సిబ్బంది చిన్నయ్య, మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, సత్యమూర్తి, మణి, దాసరి చంద్ర, రమాదేవి, వాసు, వినాయక, జయశంకర్, సురేష్, ఈశ్వర్, సుగుణ సుకన్య, రమణి, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ ఆరోగ్యానికి మంచిది



సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న నగరపాలక కమిషనర్ అరుణ

చిత్తూరు కలెక్టరేట్ : సైక్లింగ్ ఆరోగ్యానికి మంచిదని నగరపాలక కమిషనర్ అరుణ అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పలు సంస్థల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఎంఎస్ఆర్ సర్కిల్, దర్గాసర్కిల్, గిరింపేట మీదుగా తపోవనం వరకు సాగింది. నగరపాలక కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవనంలో నడక, సైక్లింగ్‌తో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కాస్త దూరంలో ఉన్న పనులకు, చిన్న వస్తువులకు బైక్, కారు వంటి వాహనాలను వినియోగించకుండా సైకిల్ పై వెళ్లి రావడానికి ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వినోద్, భరత్, సునీల్, జయంత్, సూరి, మురళి, రాంబాబు, నగర యువత, పాల్గొన్నారు.

పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న రక్షిత

ఐరాల: మండలంలోని పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం 104 వైద్య శిబిరంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మరకాలకుప్పంలో..

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటివద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రక్షిత అన్నారు. మరకాలకుప్పంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, సూపర్‌వైజర్ శ్రీలత, ఆశావర్కర్ దేవప్రీత పాల్గొన్నారు.

వాహనం చక్రంలో చిక్కుకున్న చీర

- మహిళకు తీవ్రగాయాలు

గుడిపాల: మండలంలోని చీలాపల్లె వద్ద ద్విచక్ర వాహనం చక్రంలో చీర కొంగు చిక్కుకోవడంతో కిందపడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. పాపసముద్రం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు శనివారం ఉదయం సూపర్ ఎక్సల్ ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. చీలాపల్లె వద్ద వెనుక కూర్చొని ఉన్న అంబిక(31) చీర కొంగు ద్విచక్ర వాహనం చక్రంలో చిక్కుకుంది. దీంతో రోడ్డుపై ఆమె కింద పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన అంబిక